వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, ఆగస్టు 27, 2026

# హరీశ్‌రావుపై కవిత తీవ్ర ఆరోపణలు

■ బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శలు




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు తెరవెనుక కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గురువారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని, మెదక్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో రహస్యంగా మంతనాలు జరిపారని ఆరోపించారు. హరీశ్‌రావుకు బీజేపీతో పాటు మరికొందరు రాజకీయ నేతలతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని కవిత పేర్కొన్నారు. లండన్‌లో జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలను త్వరలో ఒక్కొక్కటిగా వెల్లడిస్తామని అన్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో పాల వ్యాపారానికి సంబంధించి పలు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి ఆంధ్రా ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. పలు ప్రభుత్వ పదవుల్లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ కూడా ప్రజా సమస్యలపై ప్రశ్నించకుండా వివిధ అంశాల్లో రాజీపడిందని కవిత విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ఆరోపిస్తూ, పారదర్శకత, అవినీతి రహిత పాలన కోసం తమకు అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు.

# యశోద ఆస్పత్రిలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సీఎం పరామర్శ



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులతో చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

# ప్రీపెయిడ్ విద్యుత్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం




**కోరుట్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విద్యుత్ వినియోగానికి ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. రఘు అన్నారు. నిర్ణయాన్ని నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు గురువారం కోరుట్ల బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రఘు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, అయితే ముందస్తుగా డబ్బులు చెల్లించే ప్రీపెయిడ్ విధానం వల్ల పేద, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. మొబైల్ రీఛార్జ్ తరహాలో విద్యుత్ రీఛార్జ్ చేసుకునే విధానం ప్రజలకు భారంగా మారుతుందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల విధివిధానాలను ప్రభుత్వం స్పష్టంగా, వ్రాతపూర్వకంగా ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రీపెయిడ్ విద్యుత్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

# ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో మినిమల్లీ ఇన్వాసివ్ విధానాలు

◆ ఆధునిక సాంకేతికతతో వేగంగా కోలుకునే అవకాశం




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతీ మధ్యభాగం, డయాఫ్రమ్, ఛాతీ గోడకు సంబంధించిన సంక్లిష్ట వ్యాధుల చికిత్సలో మినిమల్లీ ఇన్వాసివ్, రోబోటిక్ సర్జరీలు కీలకంగా మారుతున్నాయని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ తెలిపింది. వీడియో అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ (వీఏటీఎస్), రోబోట్ అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ (ఆర్ఏటీఎస్) వంటి ఆధునిక విధానాలతో చిన్న కోతలతోనే శస్త్రచికిత్సలు నిర్వహించవచ్చని పేర్కొంది. ఈ విధానాలతో నొప్పి, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గడంతో పాటు రోగులు త్వరగా సాధారణ జీవనానికి తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపింది. థొరాసిక్ సర్జన్ డా. రోహన్ రెడ్డి సి మాట్లాడుతూ గత దశాబ్దంలో ఛాతీ శస్త్రచికిత్సల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని, రోబోటిక్ సాంకేతికతతో సంక్లిష్ట వ్యాధులకు మరింత కచ్చితత్వంతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక వ్యాధులు, ఛాతీ కణితులు తదితర సమస్యలకు థొరాసిక్ సర్జన్లు, పల్మనాలజిస్టులు, ఆంకాలజిస్టులు, రేడియాలజిస్టులు, అనస్థీషియాలజిస్టులు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందం ద్వారా సమగ్ర వైద్యం అందిస్తున్నట్లు ఆసుపత్రి వెల్లడించింది. ఎండ్‌స్టేజ్ ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారికి అధునాతన ఊపిరితిత్తుల మార్పిడి సేవలు కూడా అందిస్తున్నట్లు తెలిపింది.

# ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఫాలోఅప్‌పై నిరంతర పర్యవేక్షణ



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) స్క్రీనింగ్, ఫాలోఅప్‌ను నిరంతరం కొనసాగించాలని హైదరాబాద్ డీఎంహెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో లాలాపేట్, సీతాఫల్‌మండి, అంబర్‌పేట్, గోల్కొండ క్లస్టర్లకు చెందిన యూపీహెచ్‌సీ, బీడీకే వైద్యాధికారులతో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా, శిశు సంరక్షణ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, క్యాన్సర్ పోర్టల్ ఎంట్రీలు, టీబీ, కీటక జనిత వ్యాధులపై సమీక్షించారు. 30 ఏళ్లకు పైబడిన ప్రతి వ్యక్తికి రోజుకు కనీసం 60 ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లు నిర్వహించి నిర్ణీత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఏఎన్ఎంలకు సూచించారు. ఏఎన్ఎంలు గుర్తించిన కేసులను వైద్యాధికారులు తప్పనిసరిగా పరీక్షించి, అవసరమైన వారికి చికిత్స అందించాలని ఆదేశించారు. మాతా, శిశు సంరక్షణ సూచికలను మెరుగుపరచడంతో పాటు హెచ్ఐవీ, సిఫిలిస్ తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్ఓ డా. మురళీధర్, డా. అనిత, పీఓ–ఎన్‌సీడీ డా. ఆశ్రిత రెడ్డి, సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రగడ్డ డివిజన్ అభివృద్ధికి పెద్దపీట

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీవన్ యాదవ్

రూ.62.70 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎర్రగడ్డ డివిజన్‌లో రూ.62.70 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సౌకర్యాలు, పాదచారుల భద్రత కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జహీరా గుల్షన్ బాగ్‌లో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు, ముకేష్ షాప్ ఎదురుగా రూ.31 లక్షలతో పైప్‌లైన్, వర్షపు నీటి డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఐఏ కన్వెన్షన్ వద్ద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, కల్పతరువు వద్ద రూ.19.70 లక్షలతో ఫుట్‌పాత్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని నవీన్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యపై ప్రభుత్వం పునరాలోచించాలి

• మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పాలిటెక్నిక్ విద్యను స్కిల్ డెవలప్‌మెంట్‌లో విలీనం చేస్తూ తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల రద్దు నిర్ణయం విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులకు గతంలో ఉద్యోగావకాశాలు లభించేవని, ప్రస్తుత నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యార్థులను పోలీసులతో అణచివేయడం కాకుండా సమస్యను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించేందుకు వెళ్తున్న రామచందర్‌రావును హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జీవో 97 రద్దు చేయకపోతే జరిగే పరిణామాలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపు రమణ రెడ్డి, మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్, వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నేరేడ్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, సీనియర్ నాయకులు జలేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.